"నీ శరీరమే నువ్వు అని అనుకుంటున్నావు కాబట్టి నీకు కోపం వస్తుంది. నేను, ఈ శరీరం వేరు అని నేను అనుకోవడం వల్ల నాకు కోపం రాదు. ఈ చేతిలోని కమండలాన్ని తిడితే ఎంతో ఈ శరీరాన్ని తిట్టినా అంతే నాకు." జవాబు చెప్పి వెళ్ళిపోయాడతను.

## 113. సంపద పెరిగే మార్గం

ఓ గ్రామంలోని ఓ రైతు తన ఇంటి పెరడులో ఓ అరటి చెట్టు పిలకని తెచ్చి వేసి పెంచసాగాడు. దానికో గెల కాసింది. ఓ రోజు అతను పొలం నించి ఇంటికి తిరిగి వచ్చేసరికి ఆ అరటి గెల ఇంట్లో కనిపించింది. ఆ రైతు దానివంక తేరిపార చూసి భార్యని అడిగాడు.

"వీటిని ఏం చెయ్యదలచుకున్నావు?"

"కొంత కూరకి వాడతాను. పాడయిపోతాయి కాబట్టి మిగిలిన వాటిలోంచి కొన్ని చిప్స్ చేసి దాస్తే ఆకలేసినప్పుడు మనం తినచ్చు. ఇంకా మిగిలినవి కూరల బండి వాడికి ఇచ్చి వేరే కూరలు తీసుకుంటాను."

"ఆ కొడవలి ఇటివ్వు."

దాన్ని అందకుని ఆ రైతు సగం గెలని తెంపి ఆ వీధిలోని వాళ్ళందరికీ పంచి వచ్చి భార్యతో చెప్పాడు.

"ఒకటి గుర్తుంచుకో. మనకున్నది ఇతరులతో పంచుకోక పోతే భౌతిక సంపద పెరగచ్చు. కాని అందువల్ల ఆధ్యాత్మిక సంపదని కోల్పోతాం."

## 114. ఎప్పుడు?

ఆధ్యాత్మిక మార్గంలో ఉన్న వారిలో చాలామందిలో కలిగే నమ్మకం, తమకి ఆత్మ సాక్షాత్కారం కలగడం జరిగిపోయిందన్నది. ఆశాపూరితమైన ఆలోచనల వల్ల కొందరు ఇలాంటి భ్రాంతికి లోనవుతూంటారు. అలాంటివారిలో ఒకరు తన గురువు దగ్గర దీక్ష తీసుకున్నాక కొంత కాలం

ఒంటరిగా ధ్యానం చేసాడు. తర్వాత వెళ్ళి తన గురువుని కలుసుకుని అడిగాడు ఆ శిష్యుడు.

"స్వామీ! నాకు ఆత్మ సాక్షాత్కారం అయింది కదా?"

అతన్ని తేరిపార చూసి చెప్పాడు గురువు.

"ఇంకా అవలేదు."

"అయిందనుకుంటున్నాను స్వామీ. ధ్యాన సమయంలో నాకు వెయ్యి సూర్యుల కాంతి జ్యోతి రూపంలో ప్రజ్వరిల్లుతూ కనుబొమల మధ్య కనబడుతోంది. ఆ సమయంలో పరమ ఆనందం, శాంతి కూడా కలుగుతున్నాయి."

"పిచ్చివాడా! మల విసర్జన అయాక పూర్తిగా అయిందో లేదో ఎలా ఇతరులని అడగకుండా ఆ సంగతి ఎవరికి వారికి ఎలా తెలిసిపోతుందో, అలాగే ఆత్మసాక్షాత్కారం అయాక 'నాకది అయింది' అని ఇతరులని అడగకుండానే ఎవరికి వారికి తెలిసిపోతుంది. ఆత్మ సాక్షాత్కారం పొందాక ఆ విషయంలో ఇంక ఎలాంటి ప్రశ్నలూ, సమాధానాలు ఉదయించవు. అదే దానికి గుర్తు." వివరించాడు గురువు.

## 115. ఇరుగు-పొరుగు

"నీ ఇరుగు పొరుగువారిని నీలాగా ప్రేమించు అని మీరు చెప్పారు. కాని ఆ ఇరుగు పొరుగు వారంటే ఎవరు? మన ఇంటికి ఆనుకుని అటూ ఇటూ ఉన్న ఇళ్ళల్లోని వారు మాత్రమేనా? లేక ఎదురిల్లు, వెనకిల్లులోని వారుకూడానా?" అనుమానం వ్యక్తం చేసాడో మనిషి.

జీసస్ చిన్నగా నవ్వి జవాబు చెప్పాడు.

"ఓ ధనవంతుడు జెరూసలెం నించి జెరికో నగరానికి వెళ్తున్నాడు. దారిలోని పదిహేడు మైళ్ళ దూరం అంతా పర్వత ప్రాంతం. అక్కడ దారి